అపరిశుభ్రం.. ఆస్పత్రి ఆవరణ

- వార్డుల్లో ఈగలు, దోమల స్వైరవిహారం
- ఇబ్బందుల్లో రోగి సహాయకులు
- పట్టించుకోని వైద్య సిబ్బంది


ఐసియూ వద్ద వరండాలో పడుకున్న రోగుల సహాయకులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: ప్రతినిత్యం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వేలమంది రోగులు, వందలాదిమంది రోగి సహాయకులు (అటెండర్స్) వస్తుంటారు. వారికి సరైన వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర చికిత్స విభాగం, జనరల్ మెడిసిన్‌కు సంబంధించి చాలామంది వ్యక్తులు ఆస్పత్రికి వస్తారు. వచ్చిన వారికి సరైన వసతులు లేకపోవడంతో ఆస్పత్రి ఆవరణ అపరిశుభ్రంగా తయారవుతుంది. రోగులకు సరైన వైద్యం అందినప్పటికీ వారితోపాటు వచ్చే సహాయకులకు తిప్పలు తప్పడం లేదు. ఇక రాత్రయితే భయానక వాతావరణం నెలకొంటుంది. వార్డుల్లో ఈగలు, దోమలు, స్వైర విహారం చేస్తూ వారికి కంటిమీద కునుకు లేకుండా పోతుంది. ఆస్పత్రికి వచ్చే రోగులతో పాటు వారి సహాయకులకు మౌలిక వసతులు కల్పనలో ఆస్పత్రి యాజమాన్యం విఫలమవుతుందని చెప్పొచ్చు. వార్డుల వద్ద నీటి సౌకర్యం, మరుగుదొడ్లు సరైన విధంగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంలో వైద్యసిబ్బంది పట్టించుకోవడం లేదని రోగి సంబంధికులు చెబుతున్నారు.

ఐసియూ వద్ద ఇబ్బందులు:
అత్యవసర చికిత్స నిమిత్తం అడ్మిట్ అయిన రోగి సహాయకులకు రాత్రిపూట తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలిసి వస్తుంది. రోగులకు భాగానే ఉన్నప్పటికీ వారితో వచ్చిన రోగిసహాయకులు రాత్రిపూట వరండాలోనే నిద్రించాల్సిన దుస్థితి నెలకొంది. వారు భోజనం చేసేందుకు కూడా సరైన స్థలం లేకపోవడంతో చెట్ల కింద తినాల్సిన వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.
ఆస్పత్రి ఆవరణ, చెట్లకింద భోజనం చేసిన అనంతరం అక్కడ శుభ్రం చేసే వారు కరువయ్యారు. దీంతో ఆస్పత్రి పరిసరాలు అపరిశ్రుభంగా తయారవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మెరుగైన వసతులు కల్పించాలని వారు కోరుతున్నారు.


ఐసియూ వద్ద పేరుకపోతున్న చెత్తా, చెదారం

నీటి సౌకర్యం కల్పించాలి

ఐసియూలో రోగుల దగ్గరకు వెళ్లేందుకు కాళ్లు కడుక్కొని వెళ్లడానికి మంచినీటి నల్లా ఏర్పాటు చేయాలి. అలాగే భోజనం చేసే ముందు కాళ్లు, చేతులు కడుక్కుందామంటే మరుగుదొడ్లలో వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. అందులోకి వెళ్తే తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది.

యాదమ్మ, సంగారెడ్డి

వసతి ఏర్పాటు చేయాలి

ఐసియూలో చికిత్స తీసుకుంటున్న రోగుల కోసం వచ్చిన సహాయకులు రాత్రి ఉండాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోగుల వెంబడి వచ్చిన మాకు రాత్రి ఉండేందుకు సరైన వసతి కల్పించాలి. లేకపోతే రోడ్లపై, వరండాల్లో పడుకోవాల్సి వస్తుంది.

రాములు, సంగారెడ్డి

మెరుగైన సేవలు అందిస్తాం

ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే ఆస్పత్రిలో వసతులు మెరుగు పరుస్తాం. రోగులకు, వారి సహాయకులకు మెరుగైన సేవలు అందించడమే మా లక్ష్యం. ప్రజలు కూడా ఓపికతో సేవలు తీసుకోవాలి. సిబ్బంది నుంచి ఎలాంటి ఇబ్బందులు ఉన్న మా దృష్టికి తీసుకురావాలి.

డాక్టర్ అనిల్, ఆస్పత్రి పర్యవేక్షకుడు

క్లుప్తంగా

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుకు సన్మానం


శంభీపూర్ రాజును సన్మానిస్తున్న వెంకటేశంగౌడ్ తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు విప్ పదవిని ప్రభుత్వం కేటాయించడంతో బీఆర్‌ఎస్ జిల్లా యువత మాజీ అధ్యక్షుడు వెంకటేశంగౌడ్ సోమవారం రాజును ఘనంగా సన్మానించారు. సీఎం కేసీఆర్‌కు వెంకటేశంగౌడ్ కృతజ్ఞతలు చెప్పారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఇలాంటి పదవులు మరిన్ని పొందాలని ఆయన ఆకాంక్షించారు. మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాజేశ్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి విరాళాలు


విరాళాల వివరాలను తెలుపుతున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): శివానగర్ గ్రామంలోని మల్లికార్జున స్వామి దేవాలయ అభివృద్ధికి నాయకులు విరాళాలు ఇచ్చారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి రూ.85వేలు, జెడ్పీ వైస్ చైర్మన్ రూ.10వేలు, ఎంపీటీసీ సభ్యురాలు సంతోష రూ.20వేలు, సర్పంచ్ రేఖా రూ.10వేలను అందజేశారు. జాతర ఉత్సవాల్లో అన్నదానం కోసం మాజీ సర్పంచ్ రాజు నిధులను వెచ్చించేందుకు ముందుకు వచ్చారు. దేవాలయ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్ తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


విద్యార్థులకు క్యారమ్‌బోర్డులు అందజేస్తున్న దృశ్యం

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మెడ్వాన్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరు మండలం కర్దనూర్, నందిగామ గ్రామాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పార్కర్ హనీ ఫిన్ ఇండియా సహకారంతో మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ విద్యార్థులకు క్రీడాసామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలల హెచ్‌ఎంలు, డైరెక్టర్ మధు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ మెంబర్ వెంకటేశం, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు విరాళం


నీలం మధుతో యాదవ సంఘం నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): ఊట్ల గ్రామంలో నిర్వహించే మల్లికార్జున స్వామి ఉత్సవాలకు చిటుకుల్ సర్పంచ్ నీలం మధు రూ.40వేలు విరాళాన్ని సోమవారం అందించారు. యాదవ సంఘం నాయకులు నీలం మధును జాతర ఉత్సవాలకు హాజరు కావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా విరాళం అందించిన ఆయనకు యాదవ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు అందజేత


సామగ్రి అందజేస్తున్న విద్యార్థుల

కంది(సంగారెడ్డి): కందిమండల పరిధిలోని ఇంద్రకరణ్ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు బీవీఆర్ ఐటి విద్యార్థులు15 ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లను సోమవారం అందజేశారు. స్టేట్ కాజ్ స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వసంత మాట్లాడుతూ దాతలు అందజేసిన ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు చదువుకోవడంలో ఉపయోగపడతాయన్నారు.

పౌరహక్కులపై అవగాహన కల్పించాలి

కంది(సంగారెడ్డి): గ్రామాల్లో ప్రతి నెల పౌరహక్కులదినం నిర్వహించాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు నిరుడివీరస్వామీ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రామాల్లో పౌరదినం నిర్వహించి పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కల్పించాలని కోరారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే


మాట్లాడుతున్న కాటా శ్రీనివాస్ గౌడ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం రామచంద్రాపురంలో కాంగ్రెస్‌లో చేరిన మైనార్టీలకు కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మైనార్టీల అభివృద్ధికి కృషి చేశామన్నారు. అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన ఆరు నెలల్లో 11శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చి మైనార్టీలను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో హబీబ్, శ్రీరాములు, నాసిర్, వాజిద్, పీటర్, నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రంగోలిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న ఎంఈఓ పీపీ రాథోడ్

పటాన్‌చెరు టౌన్: హెరిటేజ్ ఫెస్ట్ పోటీలో పటాన్‌చెరు మండలం లక్డారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. అక్షయపాత్ర ఫౌండేషన్ హరేకృష్ణ మూమెంట్ హెరిటేజ్ పేరుతో నిర్వహించిన కళా సాంస్కృతిక పోటీల్లో రంగోలీలో శ్రావణి, రుహీన, అంజుం, చందన ప్రథమ స్థానంలో నిలిచి ప్రశంసా పత్రాలు, మెమొంటోలు సాధించారు. ఈ బహుమతులను బంజారాహిల్స్‌లోని రోడ్ నెంబర్ 12లో గోల్డెన్ టెంపుల్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఐపీఎస్ సుమతి, శ్రీ సత్య గౌర చంద్ర దాసులు అందజేశారు. సోమవారం పాఠశాల ఆవరణలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఎంఈఓ పీపీ రాథోడ్ సర్టిఫికెట్స్‌ను పంపిణీ చేశారు. గైడ్ ఉపాధ్యాయుడు గుండు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన

కంగ్టి(నారాయణఖేడ్): ఘన్‌పూర్ గ్రామంలో సోమవారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు ఆయుష్ వైద్యులు డాక్టర్ నారాయణరావు తెలిపారు. ప్రతీ ఒక్కరు ఇంటి పరిసరాల్లో ఔషధ మొక్కలు పెంచుకోవడంతో పెరటి వైద్యం చేసుకునే వీలుంటుదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్, ఎంపీటీసీ శ్రీకాంత్, పంచాయతీ సెక్రెటరీ లక్ష్మి పాల్గొన్నారు.

కట్ట మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠలో బీజేపీ నాయకుల పూజలు

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడ గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ కట్ట మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్, జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్, నాయకులు సహదేవ్, చంద్రశేఖర్, సూజాత పాల్గొన్ని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వారికి శాలువ కప్పి సత్కరించారు.

అభివృద్ధి పనులకు తీర్మానాలు

సర్పంచ్ ప్రకాశంచారి


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామంలోని సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నట్లు గడ్డపోతారం సర్పంచ్ ప్రకాశంచారి తెలిపారు. గడ్డపోతారం గ్రామ పంచాయతీ పాలక వర్గ సమావేశాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. గ్రామంలోని గ్రామీణ క్రీడా ప్రాంగణానికి ఛత్రపతి శివాజీ క్రీడా ప్రాంగణంగా పేరు మార్చేందుకు తీర్మానం చేశారు. పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని తీర్మానించారు. ప్లాస్టిక్ రహిత గడ్డపోతారంగా ఏర్పాటు చేయాలని తీర్మాణం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మమత, ఎంపీటీసీ సభ్యురాలు జానాబాయి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): తంగడపల్లి శివారులోని కోటి బిల్వ లింగేశ్వర మఠం శ్రీ గురు గంగాధర ఆశ్రమంలో సోమవారం శివపార్వతుల కల్యాణం వైభవంగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శివపార్వతుల కల్యాణాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సిద్దన్న, నర్సింలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన కోహీర్ జట్టు

కోహీర్(జహీరాబాద్): ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని రాజనెల్లిలో నిర్వహించిన 11వ వాలీబాల్ టోర్నీని కోహీర్ జట్టు కైవసం చేసుకుంది. ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఫైనల్స్‌లో గెలిచిన జట్టుకు బీఆర్‌ఎస్ నాయకుడు మ్యాతరి అనంద్ రూ.52 వేలు, కప్పును, రన్నర్ రాజనెల్లి జట్టుకు రూ.32 వేలు, కప్పు అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మ్యాతరి ఆనంద్, ధన్‌రాజ్, భాస్కర్, ప్రకాశ్, మధుకర్, లక్ష్మణ్, బాల్‌రామ్, శ్రీనివాస్, అజయ్‌కుమార్, యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయండి

జిన్నారం(పటాన్‌చెరు): పారిశ్రామిక వాడల్లో ఫైర్ స్టేషన్ లేక పోవటంతో అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయని, వీటి నివారణకు వెంటనే ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్రక మిటీ సభ్యుడు రాజయ్య డిమాండ్ చేశారు. బొల్లార, బొంతపల్లి, పారిశ్రామిక వాడల్లో ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయంలో ఏఓకు వారు వినతి పత్రం అందించారు.

సంక్షిప్త వార్తలు

◆ సంప్రదాయబద్ధంగా ఉత్సవాలు నిర్వహించాలి
నారాయణఖేడ్: సేవాలాల్ జయంతిని లంబాడీ, గిరిజనులు అన్ని తండాల్లోనూ సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని లంబాడ యువజన సంఘం ఉమ్మడి మెదక్‌జిల్లా అధ్యక్షుడు కిషన్‌నాయక్ రాథోడ్ కోరారు. సోమవారం ఖేడ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లంబాడ గిరిజనులు సేవాలాల్ చూపిన విధంగా సన్మార్గంలో నడుచుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వం ఫిబ్రవరి 15ను సెలవు దినంగా ప్రకటించి, మండలానికి రూ.కోటి చొప్పున కేటాయించాలని కోరారు. మాజీ ఎంపీటీసీ రాంచందర్ నాయక్, సంఘం నాయకులు పవన్ పాల్గొన్నారు.

◆ పాఠశాలల తనిఖీ
కల్హేర్(నారాయణఖేడ్): మాసాన్‌పల్లిలో జెడ్పీహెచ్‌ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలలను ఎంఈఓ శంకర్ సోమవారం తనిఖీ చేశారు. పదోతరగతి ప్రత్యేక తరగతులు, విద్యార్థుల హాజరు శాతం పరిశీలించారు. విద్యార్థులను దత్తత తీసుకుని బోధించాలని టీచర్లకు సూచించారు.

◆ షటిల్‌లో క్రీడాకారుల ప్రతిభ
నారాయణఖేడ్: జిల్లాలోని చిల్వేర్‌లో శని, ఆదివారాల్లో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఖేడ్ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ క్రీడాకారులు ప్రతిభ చూపి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు.

◆ రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్
మునిపల్లి(అందోల్): ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ జరుగుతాయని బుదేరా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు పరీక్ష ఉంటుందని, పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు గంట ముందు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

◆ కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం
నారాయణఖేడ్: రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ జెడ్పీ ప్రణాళికా సంఘం సభ్యులు నగేష్ షెట్కార్ ధీమా వ్యక్తం చేశారు. అనంతసాగర్‌లో సోమవారం హాత్‌సేహాత్‌జోడో యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకొచ్చాక చేపట్టే కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. నాయకులు సంజయ్‌రామ్, శ్రీనివాస్, తాహెర్, బస్వరాజ్, సాయిలుపటేల్, మాణిక్‌రావు, సంజీవ్‌పటేల్ పాల్గొన్నారు.

◆ చర్చి నిర్మాణానికి విరాళం
మునిపల్లి(అందోల్): చర్చి నిర్మాణంకు కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రసూల్ పాటీల్ రూ.25వేలు, కమిటీ సభ్యులకు అందజేశారు. సోమవారం మండలంలోని కంకోల్ గ్రామానికి చెందిన క్రైస్తవ సోదరులు నూతనంగా నిర్మించే చర్చి నిర్మాణ పనుల కోసం విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో తుల్జారాం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ
మునిపల్లి(అందోల్): ఆయా గ్రామాల లబ్ధిదారులకు జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. సోమవారం ఎంపీపీ సమావేశ మందిరంలో ఆయా గ్రామాల లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రయ్య, శంకర్, మల్లేశం, పెద్దలోడి మాజీ సర్పంచ్ విజయకుమార్, రైతు సమితి మండల అధ్యక్షుడు మన్‌సాన్‌పల్లి పరశురాంగౌడ్ పాల్గొన్నారు.

◆ సేవాలాల్ జయంతికి ఏర్పాట్లు
నారాయణఖేడ్: ఖేడ్‌లో మంగళ, బుధ వారాల్లో నిర్వహించనున్న సంత్‌శ్రీ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు చేశారు. మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది పట్టణంలోని సేవాలాల్ చౌక్ పరిసరాలను ఊడ్చి శుభ్రం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, జెడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందర్‌నాయక్, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్ పాల్గొన్నారు.

జాతరలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

జిన్నారం(పటాన్‌చెరు): జాతరలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలంలోని కానుకుంట, రాంరెడ్డిబావి గ్రామాల్లో సోమవారం నిర్వహించిన మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చిటుకుల్ సర్పంచ్ నీలం మధుతో పాటు ఆయా పార్టీల నాయకులు, యువకులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్వామివారి సన్నిధిలో నిర్వహించిన పూజలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించిన జాతరలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్‌తో పాటు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహావిష్కరణ
పెద్దమ్మగూడ గ్రామంలో నూతనంగ ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, వెంకటేశంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు.

దేశానికి వెన్నుముక యువత
పటాన్‌చెరు: యువకులే దేశానికి వెన్నుముక అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రాజకీయాల్లో యువత భాగస్వామ్యం పెరగాల్సిన అవశ్యకత ఉందని అభిప్రాయపడ్డారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు సాయి కాలనీలో రూ.20లక్షలతో నిర్మించ తలపెట్టిన యువజన భవన నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...భారత స్వాతంత్ర సంగ్రామం నుంచి మొదలు పెడితే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వరకు యువకులే కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో యువజన సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారన్నారు. మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహా గౌడ్, స్థానిక కౌన్సిలర్ బాలమని బాలరాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


బాల సభలో మాట్లాడుతున్న సర్పంచ్

న్యాల్‌కల్(జహీరాబాద్): గ్రామంలో నెలకొన్న సమస్యలతో పాటు పాఠశాలలో నెలకొన్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మెటల్‌కుంట సర్పంచ్ పీటర్‌రాజు అన్నారు. సోమవారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బాలసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సెల్‌ఫోన్లు ఎక్కువగా వినియోగించొద్దన్నారు. గ్రామంలో ఎక్కడైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుక రావాలని ఆయన విద్యార్థులు, వారి తల్లిందద్రులను కోరారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు లేవనెత్తిన సమస్యలకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నితిన్, జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిందండ్రులు పాల్గొన్నారు.

మెరుగైన పోస్టల్ సేవలు అందించాలని వినతి


పోస్టల్ అధికారికి వినతి పత్రం అందిస్తున్న బుచ్చిరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మెరుగైన పోస్టల్ సేవలు అందించాలని సొసైటీ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి కోరారు. సోమవారం తెల్లాపూర్‌లో మెరుగైన పోస్టల్ సేవలు అందించాలని కోరుతూ బీహెచ్‌ఈఎల్ పోస్ట్ మాస్టర్ నాగయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లాపూర్‌లో పోస్టల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలో అనేక కొత్త కాలనీలు ఏర్పడడంతో కాలనీ వాసులకు ఉత్తరాలు అందడం లేదని తెలిపారు. ఈ విషయంలో స్పందించిన అధికారులు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

కొనసాగుతున్న కంటి వెలుగు

రాయికోడ్(అందోల్): మండలంలోని ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న కంటి వెలుగు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశం సూచించారు. ఇటికేపల్లిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం పరిశీలించారు. అనంతరం మాటూర్, నాగ్వార్, జంమ్గి, ఖాంజమాల్‌పూర్ గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు రాజేందర్ పాటిల్, గౌసొద్దీన్, సిబ్బంది ఉన్నారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ పుష్ప నగేష్ కోరారు. రామచంద్రారెడ్డి నగర్ కాలనీలో కంటి వెలుగును ఆమె ప్రారంభించారు. బూరుగడ్డ నగేష్, చంద్రశేఖర్ గుప్తా పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

న్యాల్‌కల్(జహీరాబాద్): మామిడ్గి గ్రామంలో సోమవారం ఉపాధి హామీ పనులు ప్రారంభమయ్యాయి. ఉదయం సర్పంచ్ చంద్రన్న పనులను ప్రారంభించారు. ఉపాధి హామీ పనులను జాబ్ కార్డు కలిగిన కూలీలందరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ జగనాథ్‌రెడ్డి, కూలీలు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న నిఖిల్ గౌడ్

హత్నూర(సంగారెడ్డి): పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు కృషి చేయాలని నర్సాపూర్ నియోజకవర్గ బీజేవైఎం కన్వీనర్ నిఖిల్ గౌడ్ అన్నారు. సోమవారం కాసాల దౌల్తాబాద్ శివారులోని బీఎస్‌రెడ్డి గార్డెన్లో నియోజకవర్గ సమావేశాన్ని నిఖిల్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు సింగాయపల్లి గోపి, మెదక్ పార్లమెంట్ విస్తారక్ ఋషి, అసెంబ్లీ కన్వీనర్ వల్దాస్ మల్లేష్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ మురళి యాదవ్, ఓబీసీ మోర్చా సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బిట్ల మహేశ్, మండల అధ్యక్షుడు నాగప్రభు గౌడ్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి శంకర్, యువ మోర్చా అధ్యక్షులు రాజేష్, ప్రేమ్, హరీష్, సత్యం నవీన్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం


మాట్లాడుతున్న జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్

మునిపల్లి(అందోల్): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు ఏర్పాటు కోసం ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ నిధులు మంజూరు చేయించారని గుర్తు చేశారు. ఎస్‌డీఎఫ్, సీడీపీ, ఎన్ఆర్‌జీఎస్, జెడ్పీటీసీ నిధులతో సీసీ రోడ్లను వేస్తామన్నారు. మాజీ ఎంపీపీ చంద్రయ్య, వ్యవసాయ సహకార పరపతి సంఘం మాజీ చైర్మెన్ పెద్దలోడి విజయ్‌కుమార్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

24 మందికి కోవిడ్ టెస్టులు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయిం. సోమవారం 24మందికి కోవిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు వైద్య సిబ్బంది మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 29 మందికి నిర్వహించినట్లు తెలిపారు.

శ్రీ రామలింగేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు టౌన్: మహాశివరాత్రి మండల పూజల్లో భాగంగా చివరి సోమవారం పురస్కరించుకొని పట్టణంలోని శ్రీ రామలింగేశ్వర దేవాలయంలో శివస్వాములు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మహేశ్ మాట్లాడుతూ...మండల పూజల్లో భాగంగా ప్రతి వారం అన్నదానం నిర్వహించినట్టు చెప్పారు.

పైపులైన్‌కు మరమ్మతులు

నర్సాపూర్: పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా క్రమంగా జరిగేలా చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ తెలిపారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. అందులో భాగంగా పట్టణంలోని రెండవ వార్డులో పైపులైను పాడైనట్లు తమ దృష్టికి వచ్చిందని, దానికి మరమ్మతులు చేయించి తాగు నీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు ఆయన చెప్పారు.